ప్రజాశక్తి

బుధవారం 30 నవంబర్ 2022

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అప్పులు... పస్తులు

- క్లాప్ మిత్రాల జీవితాలు అగమ్యగోచరం
- 15 నెలలుగా వేతనాలు పెండింగ్
- రూ.6 కోట్లకుపైగా బకాయిలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి రోజువారీ చెత్త సేకరిస్తారు. తడి పొడి చెత్తను విడగొడతారు. సేంద్రీయ ఎరువులుగా మార్చి సంపద సృష్టిస్తున్నారు. ఇలా పల్లె ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతోపాటు గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించేందుకు కష్టపడుతున్న క్లాప్, షెడ్ మిత్రాల జీవితాలు దయనీయంగా మారాయి. వీరికి ఇచ్చే అరకొర వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అప్పులతో లేకుంటే పస్తులతో బతుకులు వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడింది. క్లాప్ మిత్రాలకు నెలకు రూ.10 వేలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జివో నంబర్ 680 విడుదల చేసింది. జిల్లాలోని 491 గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క పంచాయతీలోనూ ఈ జీవో అమల్లోకి రాలేదు. అవనిగడ్డ గ్రామ పంచాయతీలో 30 మంది క్లాప్ మిత్రాలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి 15 నెలల మేర బకాయిల పేరుకుపోయాయి. రెండు రోజుల క్రితం ఆరు నెలలు బకాయి చెల్లించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేల చొప్పున రూ.36 వేలు చెల్లించారు. వచ్చిన వేతనంలో ఒక్క రూపాయి కార్మికుల ఇంటికి వెళ్లలేదు. 15 నెలలుగా చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే వచ్చిన మొత్తం సరిపోయిందని వాపోతున్నారు. ఇంకా ఒక్కో కార్మికునికి సగటున ఏడు నెలలు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. మోపిదేవి గ్రామ పంచాయతీలో ఎనిమిది మంది పంచాయతీ కార్మికులనే క్లాప్ మిత్రాలుగా మార్చారు. ఒక్కొక్కరికి నెలకు రూ.9 వేలు (మిగతా 6లో)

రాజధాని అభివృద్ధిపై ప్రతిష్టంభన

- అయోమయంలో రైతులు
- డీలాపడ్డ రియల్టర్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతి అభివృద్ధిపై కాలపరిమితి విధిస్తూ హైకోర్టు గత మార్చిలో ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన స్టే ఉత్తర్వులతో రాజధానిలో రైతుల ప్లాట్ల అభివృద్ధిపై ప్రతిష్టంభన ఏర్పడింది. అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు ఎప్పటికి దక్కుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో అమరావతి అభివృద్ధి పనులు ఎప్పటికి జరుగుతాయో తెలియని పరిస్థితుల్లో విజయవాడ, గుంటూరు నగరాల పరిసరాల్లోని రియల్టర్లు కూడా డీలాపడ్డారు. సిఆర్‌డిఎకు భూ సమీకరణ ద్వారా భూములిచ్చిన వారిలో కేవలం 29 గ్రామాల రైతులే కాకుండా రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వివిధ తరగతుల ప్రజలు కూడా ప్రస్తుతం గందరగోళంలో ఉన్నారు. భూ సమీకరణలో రైతులు 22,736 మంది భూములు ఇవ్వగా, మరో ఆరు వేల మంది రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి సిఆర్‌డిఎకు ఇచ్చిన వారున్నారు. వీరికి కూడా రైతులతో సమానంగా గృహనిర్మాణ, వాణిజ్య ప్లాట్లు కేటాయించినా మౌలిక సదుపాయల కల్పన నిలిచిపోవడంతో గత మూడున్నర ఏళ్లుగా క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. గత కొన్ని నెలలుగా గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆశాజనకంగానే కొనసాగుతున్నాయి. అయితే తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లోనే లావాదేవీలు మందగమనంగా సాగుతున్నాయి. 2014 డిసెంబరులో ఏర్పడిన సిఆర్‌డిఎ చట్టం ప్రకారం 2015 జనవరి 2 నుంచి 29 గ్రామాల్లో భూ సమీకరణ ప్రారంభమైంది. దాదాపు ఏడాదిపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. సిఆర్‌డిఎ చట్టం ప్రకారం మూడేళ్లలో భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను అప్పగించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వ హయంలో నాలుగేళ్లలో ఈ ప్రక్రియ ఏమాత్రం ముందుకు సాగలేదు. మొత్తం 33,771 ఎకరాల భూమిని రైతులు సిఆర్‌డిఎకు కేటాయించారు. ఇందుకు ప్రతిగా అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వాల్సి ఉండగా కేవలం కాగితాలకే పరిమితం చేశారు. మొత్తం 16 ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయించారు. గృహ అవసరాలు, వాణిజ్య అవసరాలకు కలిపి ఒక్కో రైతుకు రెండు రకాల ప్లాట్లు వచ్చాయి. మొత్తం 54 వేల పాట్లు ఏర్పాటు చేసినట్లు రికార్డులో చూపారు. మొత్తం 16 ప్యాకేజిల్లో చేపట్టిన పనులు గత ప్రభుత్వ

హయంలో 4.45 శాతం మాత్రమే పూర్తికాగా, వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో గత మార్చిలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడు నెలల్లో రైతులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయలేదు. ఈ ఆదేశాలపై తాజాగా సోమవారం సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. అమరావతిలో ఎటువంటి అభివృద్ధి లేకపోవడంతో హైకోర్టు తీర్పు తరువాత కూడా గత 8 నెలల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏమాత్రం పుంజుకోలేదు. సుప్రీంకోర్టు తీర్పు తరువాత రాజధాని ప్రాంతంలో భూముల క్రయ విక్రయాలపై మరింత ప్రతిష్టంభన పెరిగింది. మరోవైపు వికేంద్రీకరణ తమ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం ప్రకటించారు. న్యాయ ప్రక్రియకు లోబడి త్వరలో మూడు రాజధానుల చట్టం పగడ్బందీగా తీసుకువస్తామని ఆయన చెప్పారు. దీంతో తమ ఆశలు ఎప్పటికి నెరవేరుతాయోన్న నైరాశ్యంలో రాజధాని రైతులు, రియల్టర్లు చిక్కుకుపోయారు. గత మూడున్నర ఏళ్లుగా రాజధాని అమరావతి ప్రాధాన్యత కోల్పోయేలా చేసి తమ ప్రాంతంలో భూముల విలువను తగ్గించి తమకు తీవ్రనష్టం చేశారని రైతులు వాపోతున్నారు. రాజధానిలో గజం లక్ష పలుకుతుందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన భరోసాతో రైతులు భూ సమీకరణలో 33,717 ఎకరాలను ఇచ్చారు. కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైంది. 2014 నుంచి 2018 వరకు జరిగిన క్రయ విక్రయాలతో పోలిస్తే గత మూడున్నరేల్ల కాలంలో నామమాత్రంగా కూడా లావాదేవీలు జరగడం లేదు.

మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు

ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా 49వ మహాసభ తీర్మానం

అధ్యక్ష కార్యదర్శులు సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు

నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.సోమేశ్వరరావు, సిహెచ్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - విస్సన్నపేట : ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నియోజకవర్గ కేంద్రాల్లో డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా 49వ మహాసభ తీర్మానించింది. విస్సన్నపేటలోని శ్రీశ్రీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా మహాసభ సోమవారం ముగిసింది. ఈ మహాసభలో అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తింప చేయాలని, కృష్ణా యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, పీజీ పరీక్ష పేపర్ వ్యాల్యూషన్ పారదర్శకంగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న నాడు నేడు పనులు పూర్తి చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదిలను ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానించింది. 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేయడం ఆపాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, షేర్ మహమ్మద్ పేట హైస్కూల్ పరిసరాల్లో ఉన్న గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ తీర్మానించింది.

విద్యా రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలి : రాష్ట్ర కార్యదర్శి అశోక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (మిగతా 6లో)

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాషా

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ధాన్యం సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని, గోనె సంచులు, రవాణా సమస్యలు ఎదురవ్వకుండా చూడాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్సు ద్వారా తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులతో ధాన్యం సేకరణ, రీసర్వే ప్రక్రియ పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి తహశీల్దారు రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకుల సహకారంతో బ్యానర్లు, కరపత్రాలు ముద్రించడంతోపాటు గ్రామ సభలను ఏర్పాటు చేసి ధాన్యం (మిగతా 6లో)

ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుంది

జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వికలాంగుల ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుందని, క్రీడాల్లో రాణించడం ద్వారా వారు సకలాంగులకు ధీటూగా సత్తాను చాటగలరని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలలను ఆయన లాంఛనంగా ప్రారంభించి క్రీడాకారులను ఉత్సహపరిచారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైకల్యాన్ని గురించి ఆలోచించక క్రీడాలలో రాణించడం ద్వారా విభిన్నప్రతిభ వంతుడు ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని అన్నారు. సహజంగా సకలాంగుల కంటే వారు మంచి తెలివితేటలు, సమయస్ఫూర్తిని కలిగి వుంటారన్నారు. వారిలో ఉన్న ప్రతిభను వెలిక తీసి ప్రోత్సహించాల్సిన అవసరం వుందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా జీవితంలో నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ మల్లాది విష్ణువర్ధన్,చ జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, స్థానిక కార్పొరేటర్ కె. అనిత, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి రామ్ కుమార్ పాల్గొన్నారు. వికలాంగుల బాలికల వసతి గృహం, మెడోన్నా మూగ బదిరల కళాశాల, మానసిక వికాస కేంద్రం, కెడిపి ట్రస్ట్, ప్రేమ వికాస్, ప్రేమ్ నికేతన్, విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్‌లకు చెందిన క్రీడాకారులు పలు క్రీడా పోటీలలో పాల్గొని ప్రతిభను కనపరిచారు.

పోటీలను ప్రారంభిస్తున్న డిల్లీరావు, భాగ్యలక్ష్మి, విష్ణు, నుపూర్ తదితరులు

నూతన ఆలోచనలకు పదును పెట్టాలి

ఎపి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు రామ్మోహనరావు

మాట్లాడుతున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు నూతన ఆలోచనలకు పదును పెట్టి సామాజిక వికాసానికి అవసరమైన ఆవిష్కరణలను తీసుకురావాలని ఏపీ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య కె రామ్మోహనరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో బ్లాక్ చైన్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అంశంపై జాతీయ స్థాయి కార్యశాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య కే. రామ్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతిక ప్రగతిని అందిపుచ్చుకొని ముందుకు సాగినప్పుడే అభివద్ధిని పొందగలన్నారు. నూతన సాంకేతిక విప్లవం నిరంతర ప్రక్రియ అన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక ప్రయోజనాలను వినియోగించుకుంటూ సేద తీరితే మనుగడ ఉండదన్నారు. నిన్న జరిగిన ఆవిష్కరణ నేడు జరిగే మరో నూతన ఆలోచనతో వెనుకకు పోతుందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ తమ రంగాలలో చోటు చేసుకుంటున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. అప్పుడే అభివద్ధి దిశగా అడుగులు వేయగలరని వివరించారు. ప్రస్తుతం కంప్యూటర్స్ రంగంలో డేటా రక్షణ, నిల్వ చేసే ప్రక్రియలలో బ్లాక్ చైన్ సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమిక పోషిస్తుంది అన్నారు. బ్లాక్ చైన్ సాంకేతిక పరిజ్ఞానం భద్రత విషయంలో చాలా గట్టి భరోసానిస్తోందన్నారు.ఆయితే రేపు మరో నూతన సాంకేతిక పరిజ్ఞానం రాక మానదనికనుక విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ ఆలోచనలకు పదును పెడుతూ ముందుకు సాగాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలలో పూర్తిస్థాయిలో రాణించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేబీఎన్ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లోనూ చక్కని ప్రతిభను కనబరుస్తున్నారని వివరించారు. డిటో సెక్యూరిటీస్ సీటీవో ఏ లోహకర్ మాట్లాడుతూ బ్లాక్ చైన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి తునుకుంట్ల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పి ఎల్ రమేష్, ఎం వెంకటేశ్వరరావు, విభాగాధిపతి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: వివేకానంద చేయూత సంస్థ నిర్వహకులు సైరాభాను సహాయంతో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు.

మంగళవారం నాడు స్థానిక సింగ్ నగర్ బొంబాయి కాలనీ లోని వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బుచ్చిబాబు మాట్లాడుతు వివేకానంద చేయూత ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. యువత లో కెరీరిజం పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో సేవా కార్యక్రమాలు చేయడం మంచి విషయమన్నారు. యువత లో అవగాహన తీసుకురావచ్చి ఇలాంటి అనేక కార్యక్రమాలు చేయాలన్నారు.సంస్థ రాష్ట్ర అద్యక్షులు వై.రాము, డివైఎఫ్ఐ సెంటర్ సిటీ కార్యదర్శి ఎస్కే నిజాముద్దీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తదితరులు స్పోర్ట్స్ కమిటీ నాయకులు ఎస్.కె పీరు, దుర్గాప్రసాద్, శివ పాల్గొన్నారు

ఎన్‌సిసిఎ సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో 6వ వార్డులో పర్యటిస్తున్న సందర్భంగా విజ్ఞాన్ స్కూల్‌కు చెందిన విద్యార్థులకు ఎన్‌సిసిఎ

సర్టిఫికెట్లను వైసిపి యువ నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్‌రావు, ఫిరోజ్ ఖాన్, వార్డ్ కౌన్సిలర్లు కొలగాని రాము, మనోహర్, ఆకుల శ్రీకాంత్ (బాజీ), మంగోల్లు సర్పంచ్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫెన్సింగ్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సబ్-జూనియర్(అండర్ 14) విభాగంలో, (అండర్ 18) విభాగంలో ఎపి స్టేట్ ఇంటర్ - డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ అండ్ కేడెట్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్-2022-23 పాల్గొనేందుకు ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి నాగం సతీష్‌బాబు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9490798909, 9553528888కు సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా సొసైటీ బ్యాంకు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ: ది విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సొసైటీ బ్యాంక్ ఎన్నికల్లో ఈ సారి మూడు ప్యానల్స్ పోటీ చేస్తున్నాయి. గత సారి రెండు ప్యానల్స్ మాత్రమే పోటీ చేశాయి. కొత్తగా రంగంలోకి దిగిన ప్యానల్ ప్రభావం ఏ ప్యానల్‌కు నష్టం కలుగ చేస్తుందోననే దిశగా నేతల్లో, ఓటర్లలో చర్చ జరుగుతుంది. గత ఎన్నికల్లో విజయం సాధించి, మరలా ఆ గెలపును నిలబెట్టుకునేందుకు "ప్రొగ్రెసివ్ ఫ్రంట్" తనదైన శైలిలో విస్తృతమైన ప్రచారాన్ని నిర్వహిస్తుంది. వీఎంసిలోని కార్మిక సంఘాలు, సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్‌టియు బలపరిచిన "ప్రొగ్రెసివ్ ఫ్రంట్" విజయాన్ని కాంక్షిస్తూ ఇప్పటికే ఒక విడత ప్రచారాన్ని ముగించి, రెండవ విడత ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అలాగే ఈశ్వర్‌ప్యానల్, వీఎంసి ఎంప్లాయీస్ మినిస్ట్రీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ వారి పద్దతిలో ప్రచారాన్ని విస్తృతంగా చేస్తున్నాయి. స్థానిక హనుమాన్‌పేటలోని డాక్టర్ దక్షిణామూర్తి మునిసిపల్ స్కూల్‌లో వచ్చే నెల 4వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం కౌంటింగ్ ఉంటుంది. ఎన్నికల కమిటీ విజేతలను అదే రోజు రాత్రికి వెల్లడించనుంది.

వెహికల్ డిపోలో ప్రచారం చేస్తున్న ప్రొగ్రెసివ్ ఫ్రంట్ అభ్యర్థులు

మట్టి మాఫియాను నియంత్రించాలి : బచ్చుల

ప్రజాశక్తి-గన్నవరం: మట్టిని లూటీ చేసే పనిలో వైసీపీ దొంగలుఉన్నారని టిడిపి ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ధ్వజమెత్తారు. మంగళవారం గన్నవరం మండలం లో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను ఎమ్మెల్సీతో కలిసి టిడిపి బృందం పరిశీలించింది. ముదిరాజు పాలెం, సూరంపల్లి మధ్య పోలవరం కట్టపై మట్టి లేకుండా తవ్వేయడాన్ని నాయకులు గమనించారు. ఈ సందర్భంగా అర్జునుడు మాట్లాడుతూ అక్రమ తవ్వకాలు వెనుక వైసిపి నాయకులు ఉన్నారని ఆరోపించారు. గన్నవరం నియోజకవర్గంలో ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడికి డేగల్లా వైసిపి నాయకులు వాలిపోతున్నారని విమర్శించారు. గతంలో టిడిపి బృందం అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు.. అధికారులు సరిగ్గా స్పందించకపోవడం వల్లే అన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. నున్న, సూరంపల్లి, కొండపావులూరు, గోపవరపుగూడెం మధ్యలో పోలవరం కట్టను పూర్తిగా తవ్వి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. అనంతరం గన్నవరం మండలంలో కొండపావులూరు, బల్లిపర్రు పోలవరం కట్ట ప్రాంతాల్లో టిడిపి బృందం అక్రమ మైనింగ్ ప్రాంతాలను పరిశీలించింది.టిడిపి బృందంలో గన్నవరం మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు కంచర్ల ఈశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి మండవ లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్య రాజు, జిల్లా కార్యదర్శి జూపల్లి సురేష్ జిల్లా అంగన్వాడి అధ్యక్షురాలు పొదిలి లలిత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై చర్యలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో 2021 మార్చిలో ఏసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయంలో 15 మంది సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం జరిగింది. అయితే ఏసిబి కేసుల విచారణాధికారి నివేదిక ఆధారంగా 15 మంది ఉద్యోగుల్లో తొమ్మిది మందిపై చర్యలు తీసుకుంటున్నట్లు దుర్గగుడి ఈవో భ్రమరాంబ మంగళవారం ప్రకటించారు. మంగళవారం వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి మంత్రి క్యాంప్ కార్యాలయంలో దుర్గగుడి అధికారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిబి నివేదిక వచ్చిన తరువాత కూడా దానిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరిగిందని మంత్రి అధికారులను ప్రశ్నించారు. విచారణాధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని మూడు వారాల క్రితం దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన క్రమంలో తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

లింకు రోడ్లకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-తిరువూరు: వ్యవసాయ మార్కెట్ శాఖ ద్వారా లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్శిరెడ్డి తెలిపారు. స్థానిక ఎఎంసి కార్యాలయంలో మార్కెట్ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. లింక్ రోడ్లు సరిగా లేనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నిర్మాణానికి రూ.6 కోట్లు అవుతుందని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారని, వాటిని ప్రభుత్వానికి పంపు తున్నామని అన్నారు. ఖరీఫ్ ధాన్యం ఎగుమతి చేసే రైతులు, వ్యాపారులు విధిగా ఎఎంసికి రెండు శాతం సెస్ చెల్లించాలని నిర్ణయించామన్నారు.

కూచిపూడిలో సిద్ధార్థ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు జరిగిన సాంస్కృతిక సంబరాలలో నగరంలోని సిద్దార్ధ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనపరచి కూచిపూడిలో ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంఇసి చదువుతున్న కె.శృతి సమన్వి ప్రథమ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించడంతో పాటుగా డిసెంబరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు తమ విద్యార్థిని ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు శృతిని అభినందించారు.

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రతిఒక్కరూ పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు హార్పిక్ సంస్థ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి భట్నాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. హార్పిక్ తన ఫ్లాగ్ షిప్ కార్యక్రమంలో భాగంగా మిషన్ స్వచ్ఛత ఔర్ పానీ పథకం ద్వారా ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై అవగాహణ కల్పిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్య రంగాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సురక్షితమైన మరుగుదొడ్డిని అందుబాటులో ఉంచడంతో పాటు, ఇంటి పరిసరాలను శుభ్రపరచే విధంగా ఎలా ఉంచాలో తెలియచేస్తున్నామన్నారు.

చెన్నైస్ అమిర్తలో ఫ్రూట్ మిక్సింగ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మొగల్‌రాజపురంలోని చెన్నైస్ అమిర్త ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం క్రిస్మస్ సందర్భంగా ఫ్రూట్ మిక్సింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా డ్రైఫ్రూట్‌తో చేసిన కేక్‌ను అందించడం ప్రత్యేకత ఇందులో భాగంగానే నగరంలోని చెన్నైస్ అమిర్త కళాశాల విద్యార్థులు వివిధ రకాలైన డ్రై ఫ్రూట్స్‌తో మిక్సింగ్ చేసి కేకును తయారు చేస్తారు. ఇందులో భాగంగా మిక్సింగ్ కార్యక్రమాన్ని విద్యార్థులు, అధ్యాపకులతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా నోవాటెల్ హెూటల్ చెఫ్ సువ సమంత, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్

చార్వి అగర్వాల్, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ రెడ్డి బొట్ట, ఏరియా మేనేజర్ కృష్ణ కిషోర్ చిమిరాల, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ దాసరి నరేష్ పాల్గొన్నారు.

2 నుంచి 'ఇదేంఖర్మ' : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): టిడిపి ఆధ్వర్యంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకూ మచిలీపట్టణంలో "రాష్ట్రానికి ఇదేం ఖర్మ" కార్యక్రమం జరుగుతుందని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ఇదేం ఖర్మ జగన్ అని ప్రజలు తలలు పట్టుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు ఏదో చేస్తారని ఎదురుచూసిన రాష్ట్ర ప్రజలకి పంగనామాలు పెట్టావన్నారు. భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. ప్రశ్నిస్తున్న ప్రజల సంక్షేమ కార్యక్రమాలు తొలగిస్తుండటం బాధాకరమన్నారు. డిసెంబర్ రెండోతేదీ నుండి ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
బుధవారం 30 నవంబర్ 2022

పన్నులను వేగంగా వసూలు చేయాలి

మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణరావు

గుడివాడ : తడిచెత్త, పొడిచెత్తను వేరుచేయటం, ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయటంలో గుడివాడ మున్సిపాలిటీ పనితీరు బాగుందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఎన్‌వివి సత్యనారయణరావు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణరావు

ఇంటిపన్ను, వాటర్ టాక్స్, జగనన్న కాలనీలు తదితర విషయలపై ఆరా తీశారు. పన్నుల విషయంలో వచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అనతరం సత్యనారాయణరావు విలేకరులతో మాట్లాడారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్ పనితీరు బాగుందన్నారు. 100శాతం తడి,పొడి చేత్త సేకరణ జరుగుతోందన్నారు. ఎన్‌జిటి మార్గదర్శకాల ప్రకారం పూర్తిగా ప్లాంటేషన్ ద్వారా నీటిని సక్రమంగా ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జె సంపత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు క్రీడలు అవసరం

గన్నవరం : స్కూల్ గేమ్స్ 14 , 17 బాల బాలికల హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు మంగళవారం గన్నవరం మల్లిఖార్జున విద్యాసంస్థల ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించారు. ముఖ్య

అతిథిగా కెవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కెవిఆర్ కిషోర్ విచ్చేసి బాల బాలికలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఉత్తమ భవిష్యత్తుకు క్రీడలు దోహదపడతాయని చెప్పారు. బాలికల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, శాప్ అసోషియేషన్ అధ్యక్షులు గద్దె సుధాకర్ , కార్యదర్శి సిహెచ్ చందు, పీఈటీలు జి.రాంబాబు, బాలకృష్ణ, వై.మురళి, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి . దుర్గారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల పేరున డిపాజిట్లు

అవనిగడ్డ : అవనిగడ్డ పదో శ్రేణి గ్రంథాలయంలో ప్రతిరోజు పుస్తక పఠనం చేసే 15

మంది విద్యార్థులకు ఏడిపి అవనిగడ్డ శాఖకు చెందిన అధికారి రాజులపాటి ప్రసాద్ స్వయంగా డిపాజిట్లు కట్టారు. మంగళవారం ఎంపిక చేసిన 15 మంది విద్యార్థులకు డిపాజిట్లు కట్టి వారికి డిపాజిట్ కట్టిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు డిపాజిట్లు కట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ కూడా పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-మోపిదేవి

స్థానిక శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మార్గశిర షష్ఠి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల సహాయ కమిషనర్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలోరెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు బద్ద పవన్ కుమార్ శర్మ, కొమ్మూరు ఫణి కుమార్ శర్మల బ్రహ్మత్వంలో అర్చకుల వేద పండితుల వేదమంత్రాల మధ్య స్వామివారి దివ్య కళ్యాణం జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ చక్రధరరావు, సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ, ఆలయ అధికారులు టి.చెన్నకేశవ, టి.రామకృష్ణ, టి.వెంకటేశ్వరరావు, పి.నాగరాజు, అర్చకులు సతీష్ శర్మ, ఫణి శర్మ, విరూపశర్మ, అర్చకులు, యాత్రికులు పాల్గొన్నారు. శ్రీ స్వామివారి ఆలయం తరఫున స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వేలాదిమందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఏడు గంటలకు శ్రీ స్వామివారి గ్రామోత్సవం మయూర వాహనంపై నిర్వహించారు. పార్లమెంటు సభ్యులు మోపిదేవి వెంకటరమణ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ చక్రధర్ రావు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఉత్సవాల సందర్భంగా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కళ్యాణి కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ చక్రధరరావు శ్రీ స్వామివారి జ్ఞాపిక ప్రసాదములను వారికి అందజేశారు. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు యాత్రికుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది.

కలెక్టరేట్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాలను జిల్లా జాయింట్ కలెక్టర్ అపరజిత సింగ్ మంగళవారం ఆకమికంగా పరిశీలించారు. భూ విభాగం, ఎలక్షన్ సెల్, స్పందన సెక్షన్ రికార్డు రూములను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి అర్జిదారులకు సత్వర న్యాయం అందించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో ప్రసాద్, ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్లు ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

వాడీగావేడిగా మోపిదేవి మండల సమావేశం

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షులు రావి దుర్గా వాణి అధ్యక్షతన జరిగింది. పలు అంశాలపై సభ్యులు ప్రస్తావించటం, అధికారులు సమాధానాలు ఇచ్చే సమయంలో వాడీవేడిగా చర్చలు జరిగాయి. నాడు-నేడు నిధులతో వివిధ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎంఇఒ వివరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు పెదకల్లేపల్లి పాఠశాలలో ఉన్న నాపరాయిను పీకి మళ్ళీ పరుస్తున్నారని తద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాస కుమార్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తమ శాఖల ప్రగతిని గురించి వివరించారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు ఒక వ్యక్తి ఆధార్ నెంబర్ పై వివిధ ప్రాంతాలకు చెందిన మండల పరిధిలోని పలువురు ప్రజలు వినియోగించుకుంటున్న విద్యుత్ రీడింగులు నమోదు కావడంతో నిరుపేదలైన ప్రజలు పెన్షన్లు కోల్పోతున్నారని ఆరోపించారు. కోసూరు వారి పాలెం ఎంపీటీసీ సభ్యులు రాజేష్ బాబు మాట్లాడుతూ చిరువోలు వద్ద నుండి మేరకనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల రహదారికి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పనితీరు అభివద్ధి ప్రణాళికలు తెలియజేశారు. ఈ సమావేశంలో మండల తాసిల్దార్ కే నవీన్ కుమార్.ఆర్ సి ఏ ఈ చిరంజీవి పంచాయతీ రాజ్ ఏ ఇ బి శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఇ పి వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, మోపిదేవి పిహెచ్సి వైద్య లు డాక్టర్ అనిల్ కుమార్, బీసీ వసతి గహం వార్డెన్ లంకేశ్వరుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే పద్మావతి, ఈవో పి ఆర్ డి అరుణ కుమారి, కే కొత్తపాలెం గ్రామ సర్పంచ్ కొక్కిలి గడ్డ మాధవి, గ్రామ కార్యదర్శులు పి మాధవేంద్రరావు, కమ్మిలి త్రిపుర సుందరి, కే రామకోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గన్నవరం

లింగ వివక్ష పై గ్రామస్థాయి నుంచి చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అవగాహన కల్పించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరులో మహిళలు, బాలికలతో లింగ వివక్షపై గ్రామసభ నిర్వహించారు. శేషగిరిరావు మాట్లాడుతూ లింగ ఆధారిత వివక్షతకు జాతీయస్థాయి ప్రచారంలో భాగంగా అన్ని గ్రామాల్లో పురుషులు, బాలురు, బాలికలు, యువకులు ఇతర ప్రభుత్వ విభాగాలను కలుపుకొని పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టామన్నారు. సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లు, సిఆర్పిలు, వాలంటీర్లు తో కలిసి లింగ వివక్ష పై గ్రామ స్థాయిలో చర్చ సమస్యలు గుర్తింపు కేసు స్టడీస్ కేసు పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు సరోజిని, గ్రామ సర్పంచ్ ప్రసాద్, వెలుగు ఎపిఎం సాంబశివరావు, ఎఎస్ఐ, విద్యార్థినీ విద్యార్థులు, డ్వాక్రా సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దారుణం : రైతు సంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి

ఎంటియు 1061 ఎ గ్రేడ్ నుంచి కామన్ గ్రేడ్‌లోకి మార్చటం వల్ల ఆ పంటను సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోతారని ఎపి రైతుసంఘం నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని

తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

అందజేశారు. దాదాపు 19 సంవత్సరాల నుండి ఎంటియు 10 61 విత్తనాన్ని రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 26న 1061 ఏ గ్రేడ్ నుంచి కామన్ గ్రేడ్‌కు మార్చిందని తెలిపారు. దీనివల్ల రైతులు ఒక క్వింటాకు రూ.20 చొప్పున నష్టపోతారని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ రూ.2060, కామన్ గ్రేడ్‌గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఏప్రిల్ నెలలో కురిసిన భారీ వర్షాలు, వడగళ్ల వానకు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన సుమారు 4524 మంది రైతులు సుమారు రూ.3.37 కోట్లు నష్టపరిహారం ప్రకటించిన ఇవ్వకపోవటం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సమ్మిట నాంచారయ్య, పట్టపు యేసు బాబు, గౌరిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు **గన్నవరం :** గత 19 సంవత్సరాలుగా ఏ గ్రేడ్ గా ఉన్న 10 61 రకాన్ని కామన్ వెరైటీగా మార్పు చేయటం సరికాదని, దీనివలన క్వింటాకు 20 రూపాయలు నష్టపోవలసి వస్తుందని రైతు సంఘం గన్నవరం మండలం కార్యదర్శి సూరగాని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు నల్లూరి ధర్మారావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి : ఎడిఎ

ప్రజాశక్తి-ఉయ్యూరు

రబీ సీజన్లో రెండో పంటగా అపరాలు సాగు చేసేందుకు విత్తనశుద్ధి చేయడం ద్వారా చీడ పీడలు, తెగుళ్ల నుంచి పైరును రక్షించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జ్యోతి రమణి అన్నారు. ఉయ్యూరు మండలం ఆకునూరులో మంగళవారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మినుము విత్తుకునేముందు ఇమిడా క్లోప్రిడ్ 600ఎఫ్ఎస్తో శుద్ధి చేయాలన్నారు. కలుపు నివారణకు విత్తిన 48 గంటలలోపు పెం డి మిథాలిన్ ఎకరాకు 1.5 లీటర్లు పిచికారీ చేయాలన్నారు. గడ్డిజాతి కలుపు మొక్కల కు 15-20 రోజులలోపు విప్ సూపర్ 250 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలని శాస్త్రవేత్త సుధారాణి తెలిపారు. సేంద్రీయ ఎరువులను పంటలకు వేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు.

మాట్లాడుతున్న జ్యోతి రమణి

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయవాడ: ప్రాచీన సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించేందుకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అత్యధిక నిధులు కేటాయించడం ద్వారా పెద్దపీట వేస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తమిళనాడులోని ఇరోడ్‌లో జరిగిన 3వ జాతీయ ట్రెడిషినల్ సిలంభం (కర్రసాము) ఛాంపియన్ షిప్ - 2022 టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులు మంగళవారం ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయం జనహిత సదనములో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మల్లాది విష్ణు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సింగిల్ హ్యాండ్, డబుల్ హ్యాండ్ విన్యాసాలు అలరించాయి. కర్రసాము ప్రాచీన యుద్ధకళలలో ఒకటని.. దానిని రేపటితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్లాది విష్ణు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన టోర్నీలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్రం నుంచి పాల్గొన్న 24 మంది క్రీడాకారులలో.. నగరానికి చెందిన 10 మంది చిన్నారులు పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రాధాన్యతను గుర్తించి.. పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. కర్రసాము నేర్చుకోవడం వల్ల ఏకాగ్రత, ధైర్యం, ఆరోగ్యం, ఆత్మరక్షణ లభిస్తుందని వెల్లడించారు. కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడా పోటీలలో ప్రోత్సహించాలని కోరారు. ఈనెల 25, 26, 27 తేదీలలో జరిగిన టోర్నీలో అండర్ 12 విభాగంలో ఎం.హియా జైన్(10), ఎన్.యశస్వి(11) స్వర్ణం, కె.రిషికేష్(11) కాంస్యం., అండర్ 14 విభాగంలో జి.ఆరుష్(12) రజతం., అండర్ 10 విభాగంలో ఎన్.కశ్యప్(9) రజతం., రంజిత్ (9) కాంస్యం, అండర్ 8 విభాగంలో బి.మేఘనా రతన్(5) రజతం, కారుణ్య(8) కాంస్య పతకాలు సాధించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు ఇసరపు దేవీ రాజారమేష్, ఉమ్మడి రమాదేవి, యరగొర్ల తిరుపతమ్మ, ఎండి షాహినా సుల్తానా, ఉద్దంటి సునీత, మోదుగుల తిరుపతమ్మ, కుక్కల అనిత, కొంగితల లక్ష్మీపతి, శర్వాణి మూర్తి, కోచ్ సత్య శ్రీకాంత్, హరికుమార్, సోమశేఖర్, చిన్నారుల తల్లిదండ్రులు స్వప్నశ్రీ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చందర్లపాడు: మండల కేంద్రమైన చందర్లపాడులో వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.కె హస్సాన్ మాట్లాడుతూ రైతు, వ్యవసాయ కార్మిక సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వేల్పుల ఏసోబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.కె ఉద్దండ్ సాహెబ్, ఎస్.కె హుస్సేన్ సాహెబ్, కె.సీతారావమ్మ, వేమూరి నాగేశ్వరరావు, పి.వెంకటనారయణ పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-చందర్లపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 136 మంది డప్పు కళాకారులకు ప్రభుత్వం

అందజేసిన డప్పు కిట్లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఎంపీపీ వేల్పుల ఏసమ్మ, జడ్పిటిసి ముక్కపాటి నరసింహారావు, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కంచికచర్ల: గండేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఓ ఎల్.చిట్టిబాబు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో నాడునేడు ద్వారా నిర్మాణంలో ఉన్న

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలౌతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో 350 మంది విద్యార్థులకు కేవలం 155 మంది మాత్రమే మధ్యాహ్న భోజనం చేయటంతో, మధ్యాహ్న భోజనం పథకం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

తేజ డివిఆర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-నందిగామ: విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుల్లో రాణించాలని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని తేజ డివిఆర్ కళాశాలలో మంగళవారం ఫ్రేషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పరచుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు ఆళ్ల రాంబాబు, ప్రిన్సిపల్ సిరివెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

9న తిరుపతమ్మ ఆలయం అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్మానానికి సంబంధించి పాలకమండలి సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆలయ చైర్మన్ చెన్నకేశవరావు తెలిపారు. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయ పాలకమండలి సమావేశం మంగళవారం చైర్మన్ చాంబర్‌లో ఆలయ సంయుక్త కమిషనర్ ఎస్‌విఎన్ మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డిసెంబర్ 9వ తేదీన అమ్మవారి ఆలయం వద్ద కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ విప్ సామి ఉదయభాను హాజరవుతారని తెలిపారు. 19వ తేదీ నుండి జరిగే శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లపై పాలకమండలిలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఇ వైకుంఠరావు, ఎఇఓ ఉమాపతి, ధర్మకర్తలు నరసింహారావు, రామారావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్‌బాబాను అరెస్ట్ చేయాలని నిరసన

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన రాందేవ్‌బాబాను అరెస్టు చేయాలని ఎంసిపిఐ(యు) ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. ఎంసిపిఐ(యు) విజయవాడ అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పంజా సెంటర్‌లో మంగళవారం రాందేవ్ బాబా చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ, సెంట్రల్ నాయకులు ఎస్.కె.అజాజ్, ఎస్.డి.సుభాని, మైలవరం నియోజకవర్గం నాయకులు కొల్ల శ్రీను, అజీజ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వ్యాన్‌లో కుర్చీల తరలింపుపై ఖండన

ప్రజాశక్తి-వన్‌టౌన్: 50వ డివిజన్ 177వ సచివాలయం పరిధిలో జి.సుబ్బారెడ్డి షామియానా షాపు నుండి రేషన్ వ్యాన్‌లో కుర్చీలు తరలించారని సిపిఎం నాయకులపై వైసిపి నేతలు అసత్య ప్రచారం చేయడాన్ని సిపిఎం పశ్చిమ నగర కమిటీ సభ్యులు యం.కొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. రేషన్ వ్యాన్ డ్రైవర్ తన ఇంటివద్ద జరుపుకునే సొంత కార్యక్రమానికి కుర్చీలు తరలించుకున్నారని, సిపిఎంకుగానీ, నాయకులకుగానీ ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్‌లో ఓటమిని జీర్ణించుకోలేక స్థానిక వైసిపి నాయకులు చేస్తున్న ఈ తప్పుడు ప్రచారాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జయరాం అధ్యక్షతన ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుండి ఒక్కో సచివాలయానికి విడుదల కానున్న రూ.20 లక్షలతో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి, వాటి అంచనా విలువ తదితర అంశాలపై నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.

56వ డివిజన్లో మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) సౌజన్యంతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుర్‌మీరా ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ సౌజన్యంతో నడపబడుతున్న మొబైల్ అన్న క్యాంటీన్ 34వ రోజు మంగళవారం 56వ డివిజన్‌లో ఏర్పాటు చేశారు. డివిజన్ నాయకులు ఈశ్వర్ ఆధ్వర్యంలో పాత రాజరాజేశ్వరిపేట, సాయిబాబా గుడి రోడ్డు, కరీముల్లా టీ స్టాల్ వద్ద నాగుల్‌మీరా, యువ నాయకులు కాంద్రేగుల రవీంద్ర చేతులమీదుగా అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొట్టేటి హనుమంతరావు, గుర్రంకొండ, నాగోతి రామారావు, కామా దేవరాజ్, గణపా రాము, ఈగల సాంబ, పేరాబత్తుల రమణ, బుదాల నందకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

1,836 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఓసీ క్లబ్ లో నియోజకవర్గం స్థాయిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో విజయవాడలోని వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన వైద్య సిబ్బంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,826 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 800 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 51 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు

కోగంటి బాబు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, నాయకులు మాగంటి బాబు, పుల్లారావు, గరజాల అజయ్‌కుమార్, చీదిరాల భరత్‌రెడ్డి, వేమా వెంకట్రావు, అన్నదాత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం గ్రామ సమీపంలో యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మల్కాపురం గ్రామానికి చెందిన ఇడుపులపాటి సంతోష్‌కుమార్ (30) జగ్గయ్యపేట పట్టణంలోని ఒక మాల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు అనంతరం మల్కాపురంకు ద్విచక్ర వాహనంపై వెళు తుండగా రోడ్డుపై పడి మృతిచెందాడు. సంతోష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ప్రసన్నకుమారి ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి రాష్ట్ర బిసి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా గురుమూర్తి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బిసి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు గ్రామానికి చెందిన వీరంకి వెంకట గురుమూర్తి

గురుమూర్తిని అభినందిస్తున్న కొనకళ్ల, కొల్లు తదితరులు

నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక పదవి అప్పగించిన నారా చంద్రబాబు నాయుడు, అచ్చం నాయుడు, నారా లోకేష్,కొల్లు రవీంద్ర, కొనకళ్ళ నారాయణ రావు,వర్ల కుమార్ రాజా, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో బిసిలను చైతన్యం చేసి టీడీపీ విజయానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ నియామకాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బల్లయ్య మచిలీపట్నంలో గురుమూర్తిని అభినందించారు.

పెరికీడులో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పెరికీడు గ్రామంలో ని నాలుగు రోడ్ల కూడలిలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ముందుగా నక్కా

బాబు ఆధ్వర్యంలో పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకం చేశారు. తవ్వా మధు మోహిని దంపతుల ద్వారా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం జరిగింది. కుందేటి శీతారామయ్య, శ్యామ్ కళ్యాణం చేయించారు. ఈకార్యక్రమంలో కొల్లిమర్ల రంగారావు, నందూరి శర్మ, తవ్వా మూర్తి, సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్, నక్కా పవన్, మజ్జి దీవెన, జెట్టి ఏడుకొండలు, అనిపెద్ది కృష్ణమూర్తి, జెట్టి శ్రీనివాసరావు, పల్నాటి శ్రీను, నూకల సుశీల, అనిపెద్ది కళ్యాణి, మల్లాది శాంత, పల్నాటి విజయనిర్మల, పల్నాటి లక్ష్మీ, తవ్వా పుష్పావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.54 లక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని శ్రీ రాజరాజేశ్వరి సమేత

హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

రాజశేఖర్ స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 9 నెలల కాలానికి గాను రూ.1,54682 ఆదాయం వచ్చిందని ఈవో పి.సీతారామయ్య తెలిపారు. తనిఖీదారుగా దేవాలయ ధర్మాదాయ శాఖ మచిలీపట్నానికి చెందిన కే శ్రీనివాస్, చల్లపల్లి గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణ అధికారి సిహెచ్ సుధాకర్ పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ సింహాద్రి రామనాథం బాబు, సభ్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న అగ్రిగోల్డ్ బాధితులు

అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో మిగిలివున్న రూ.10 వేలు, రూ.20 వేలలోపు బాధితులందరికీ తక్షణమే చెల్లింపులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల కలక్టరేట్ ధర్నా చౌక్ లో 30 గంటల పాటు చేపట్టిన ధర్మాగ్రహ నిరాహార దీక్షలు మంగళవారం తో ముగిశాయి. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 2022 డిసెంబరు 31 లోపు రూ.20 వేల పైబడిన బాధితులందరికీ పూర్తి చెల్లింపులు జరిగేటట్లు స్పష్టమైన ప్రణాళికను ప్రకటించాలని, అగ్రిగోల్డ్ సంస్థలో స్థలాలు, పొలాలు కొన్నవారికి వారి ప్లాట్లను, వ్యవసాయ భూములను స్వాధీన పర్చాలని కోరారు. వ్యవసాయ భూముల కౌలు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంతటి ద్రోహానికి కారకులైన అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ, వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్వాధీనం చేసుకున్న అగ్రిగోల్డ్ సంస్థ వేల కోట్ల ఆస్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసి బాధితులందరికీ పూర్తి న్యాయం చేయాలన్నారు.బాధితులలో ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ ధర్మాగ్రహ దీక్షకు సీపీఐ జిల్లా నాయకులు మోదుముడి రామారావు సంఘీభావం తెలిపారు. కె.గగన్, టి.ఏడుకొండలు ,ఎస్. మార్క్, వరలక్ష్మి, శేషు కుమారి, వెంకట రమణమ్మలు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు లేని సమాజాన్ని నిర్మించాలి

ప్రజాశక్తి - గుడివాడ

జ్యోతిరావు పూలే స్ఫూర్తితోమూఢ నమ్మకాలు లేని సమాజాన్ని నిర్మించటానికి మేధావులు నడుం బిగించాలని డైట్ విశ్రాంత ప్రదనాధ్యాపకుడు ఎమ్.వి.జి.ఆంజనేయులు కోరారు. సోమవారం సాహితీ స్రవంతి ఆద్వర్యంలో వీరపనేని మురళీధరరావు మీటింగ్ హాలులో జ్యోతిరావు పూలే 132 వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి కన్వీనర్ ఎల్.సురేంద్ర అధ్యక్షత వహించారు. పూలే చిత్రపటానికి ఐద్వా కార్యదర్శి పి.రజని, ఉపాధ్యక్షురాలు బి.అరుణ పూలమాలవేసి నివాళు లర్పించారు. మూఢనమ్మకాలను పారద్రోలి కుల, వర్గ రహిత సమాజాన్ని నిర్మించటానికి త్రికరణ శుద్ధిగా కృషి చేసిన జ్యోతిరావు పూలే బాటలో మేధావులు, యువత పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లిబ్రేరియన్ డి.ఏ.బోస్,కవి మాల్యాద్రి, అభ్యుదయ కవి గునుకుల మాల్యాద్రి, సాహితీ వేత్త ఫ్రాన్సిస్, విశ్రాంత తెలుగు పండితులు వి.రాఘవాచారి,తెలుగు పండితులు ఎస్ .శ్రీకుమార్, ఎమ్.డి.ఓ టైపిస్టు పీటర్, యు.విశ్వేశ్వరరావు, కో.కన్వెనర్ బి.వి.శ్రీనివాసరావు అవిర్నేని వెంకటేశ్వరరావు, కళా కారుల సంగం నాయకులు రాధాకష్ణ,హఫీజా,బి.ఎస్. కుమారి,విశ్రాంత ఉపాధ్యాయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను హింసిస్తే కఠిన చర్యలు : పీడీ

ప్రజాశక్తి-ఉయ్యూరు

మహిళలను వేధించినా, హించింసినా, వివక్షత చూపినా చట్టం ప్రకారం కఠిన చర్యలుంటాయని జిల్లా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ అన్నారు. పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులు (నిరోధం, నిషేధం, పరిహారం) చట్టం- 2013 పై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై హింస పెరిగిపోతున్న నేపథ్యలో చట్టాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రేమ, పెళ్లి పేరుతో చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మహిళలకు అండగా ఉండేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలికా సంరక్షణ, నిర్భయ, దిశ చట్టం, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని వివరించారు. ఉయ్యూరు ఐసీడీఎస్ అధికారి ఆరుద్ర, ఎంఇఒ పద్మావతి, పట్టణ ఎస్సై ఎన్.వీరప్రసాద్ తదితరులు పాల్గొని మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న సువర్ణ

బొండాడ రాఘవేంద్రరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

దివిసీమకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్రరావు పుట్టినరోజు వేడుకలను అనాథ పిల్లల మధ్య జరుపుకున్నారు. హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్ హోంలో అనాథ పిల్లల మధ్య మంగళవారం ఆయన కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం 75 మంది అనాథ పిల్లలకు నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఇలాంటి పిల్లలను చూసుకోవడం చాలా కష్టమైన విషయమన్నారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు ఎంతో ఓర్పుతో

స్వీటు ప్యాకెట్లు పంపిణీచేస్తున్న బొండాడ రాఘవేంద్రరావు

సేవలందిస్తున్న ఆశాజ్యోతి సంస్థ సేవలను కొనియాడారు. తన వంతు సహాయంగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చానన్నారు. రెడ్ క్రాస్ సంస్థ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు వంగర శేషగిరిరావు మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందిన బొండాడ రాఘవేంద్రరావు మంచి మనసున్న వ్యక్తిగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. పలు అనాథ శరణాలయాలకు సహాయం అందించడంతోపాటు ఎందరో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి వారి భవిష్యత్తుకి బంగారు బాటలు వేస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో పలు జిల్లాల్లో తమ సంస్థ ద్వారా రూ.కోటి వరకు సేవలకు ఖర్చు చేశారన్నారు. రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక బంగారు పతకం అందుకోవటం దివిసీమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి కార్యదర్శి మాధవీలత, అధ్యక్షులు వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు టీవీఎస్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం : డిటిఎఫ్

ప్రజాశక్తి-పెదపారుపూడి

ఉద్యమాల ద్వారానే అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని డెమోక్రటిక్ టీచర్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వరుణ్ కుమార్ ఒక ప్రకటనలో అన్నారు. డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.నరహరి, ప్రధాన కార్యదర్శి ఎన్వి. రమణయ్య ఆదేశాల మేరకు మండలంలో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించుకోవడా నికి కాళ్లు పట్టుకోమనడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు తగదని పేర్కొన్నారు. ఎంతో రాజకీయ చరిత్ర కలిగి ఉండి, విద్యాశాఖకు నేతృత్వం వహిస్తున్న మంత్రి అలాంటి మాటలను మాట్లాడటం మంత్రి విజ్ఞతకే వదిలేస్తున్నామని వివరించారు.

వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ

ఉయ్యూరు: కోత, కుట్టు లేని వ్యాసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడం ద్వారా కుటుంబ నియంత్రణ పాటించాలని అర్బన్

ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

హెల్త్ సెంటర్ వైద్య అధికారి తేజస్విని అన్నారు. వ్యాసెక్టమీ పై అవగాహన, శస్త్ర చికిత్స పక్షోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం ఉయ్యూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాసెక్టమీ చేయించుకోవడం సులువని, దీనివల్ల ఏవిధమైన ఇబ్బందులు ఉండవన్నారు. సూపర్ వైజర్ కె.శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యశ్వంత్‌ను అభినందిస్తున్న కళాశాల బృందం

జెఎన్‌టియు వాలీబాల్ జట్టులో వికాస్ విద్యార్థి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : జెఎన్‌టియు విశ్వవిదాలయ స్థాయిలో వాలీబాల్ పోటీలకు విజయవాడ రూరల్ మండలం నున్న వికాస్ ఇంజనీరింగ్ విద్యార్థి పి.యశ్వంత్ ఎంపికైనట్లు కళాశాల కార్యదర్శి ఎన్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణ తెలిపారు. వాలీబాల్ జట్టులో ఎంపికలకు పల్నాడు జిల్లా నరసరావుపేట కళాశాలలో జరిగాయన్నారు. ఎంపికల్లో యశ్వంత్ అత్యంత ప్రతిభ కనబర్చాడని తెలిపారు. ఈ సందర్భంగా యశ్వంతను వికాస్ కళాశాల అధ్యాపక బందం, వ్యాయమ ఉపాధ్యాయుడు పులి పెదబాబు తదితరులు అభినందించారు.

పిఎన్‌ఎం కళాకారుడు రామకృష్ణ సంస్మరణ సభ

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు కళారూపాల్ని విస్తతంగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం నున్నలో పీఎన్నెమ్ సీనియర్ కళాకారుడు సంకా రామకృష్ణ సంస్మరణ సభకు ఆయన అధ్యక్షత వహించారు. పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పన్న మాట్లాడుతూ సామాజిక రుగ్మతలను దునుమాడేందుకు కళలు సాధనం కావాలన్నారు. రామకష్ణ సహాధ్యాయులు ఏ అజయ్ కుమార్, జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రామకష్ణ స్ఫూర్తితో పీఎన్నెమ్ ను మరింతగా జనంలోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతుందన్నారు. జి.ప్రభాకర్, జి.చిన వెంకటరెడ్డి, మాతంగి ఆంజనేయులు, షేక్ మస్తాన్ వలి, పోలారెడ్డి సాంబిరెడ్డి, దాసరి కామేశ్వరరావు, కె.శ్రీనివాసరెడ్డి, డి.ఫ్రాన్సిస్ తదితరులు మాట్లాడారు.

రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, కళాకారులు

భవనాల నిర్మాణం వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగవంతం చేసేలా అధికారులు సమన్వయంతో పనులను పురోగతి చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల ప్రగతిని మండల స్పెషల్ ఆఫీసర్లు, యంపిడివోలు, పంచాయతీ రాజ్, ఇంజనీంగ్ అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి టెలీకాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో రూ.107 కోట్ల నిధులతో 268 గ్రామ సచివాలయాలను, రూ. 56 కోట్ల 68 లక్షల నిధులతో 260 రైతు భరోసా కేంద్రాలను, రూ. 41 కోట్ల 82 లక్షల నిధులతో 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను, రూ 25 కోట్ల 97 లక్షల 49 వేల నిధులతో 147 బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం నిర్మించాల్సిన 914 భవన నిర్మాణాలకుగాను 230 కి పైగా నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. వీటిలో ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్న 117 భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎస్ఇ ఎ.వెంకటేశ్వరరావు, మండల స్పెషల్ ఆఫీసర్లు, యంపిడివోలు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

భద్రాచలం జాతీయ రహదారి ఎలైన్‌మెంట్‌ను పూర్తి చేయండి : జెసి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ- భద్రాచలం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన ఎలైన్‌మెంట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్‌కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అధికారు లను ఆదేశించారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి 30కు సంబంధించి విజయవాడ రూరల్

మండలం జక్కంపూడి, వేమవరం గ్రామాలలో రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి మంగళవారం ఎలైన్‌మెంట్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేర్తయినందున ఎలైన్‌మెంట్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం పి నైనవరంలోని బహుళ ప్రజయోజ కేంద్రం (యంపిఎఫ్‌సి) నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

సచివాలయం, ఆర్‌బికెలను పరిశీలించిన జెసి

విజయవాడ రూరల్ జక్కంపూడి గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలను జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ పరిశీలించారు. అలాగే రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి రైతులకు అందిస్తున్న వివిధ రకాల సేవలపై ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈపర్యటనలో విజయవాడ రూరల్ తహాశీల్దారు శ్రీనివాస్ నాయక్, సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా పోరాడాలి : ఐద్వా

ప్రజాశక్తి - విజయవాడ : హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 1, 29 డివిజన్లలో మంగళవారం ఐద్వా ఆధ్వర్యాన గ్రూపు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి కె. శ్రీ దేవి మాట్లాడుతూ మహిళలు చదువుకుని ఉద్యోగం చేస్తూ ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లినా హింసను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇంటాబయటా కూడా రక్షణ లేనివిధంగా నేడు సమాజంలో పరిస్థితులు ఉన్నాయన్నారు. మహిళలు ఒకవైపు కుటుంబ హింసను, మరోవైపు పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారని అన్నారు. మద్యం, మత్తు పదార్థాల కారణంగా నేరాలు మరింతగా పెరిగిపోతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ అధ్యక్షులు కె.సరోజ, యస్.కె. షకీలా, బి. విజయ, లావణ్య పాల్గొన్నారు.

డిఇఒ బ్యాంక్ ఖాతా నుండి రూ.4.90 లక్షలు మాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కష్ణా) : అమాయకులను ఆసరాగా చేసుకుని వారి బ్యాంకు ఖాతా నుండి లక్షలాది రూపాయలు మాయంచేస్తున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు నేరుగా ప్రభుత్వాధికారుల ఖాతాలపై దష్టి సారించారు. ఈనేపథ్యంలోనే కష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా వేతన బ్యాంక్ ఖాతా నుండి రూ.4.90 లక్షలు మాయమైనట్లు గుర్తించారు. గత ఏడాది కాలం నుండి విడతలవారీగా ఈ ఖాతా నుండి నగదు మాయమవుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గుర్తించడంతో సోమవారం చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ జనార్ధన్ తెలిపారు. జిల్లా ఎస్పీ పి జాషువా ఇప్పటికే ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారని తెలిపారు.

టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలి : సిపిఐ

ప్రజాశక్తి - విజయవాడ : టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. దాసరి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జక్కంపూడి, వేమవరం, షాబాద్‌లలో ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణానికి 11వేల మందితో రూ.25వేల నుండి రూ.లక్ష వరకు డిపాజిట్లు కట్టించుకొని 6,576 ఇళ్లను 90శాతం వరకు నిర్మించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లవుతున్నా టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించక పోవడం శోచనీయమన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : నిబంధనలు ఉల్లంఘించిన వారికి మొబైల్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ మంగళవారం రూ.13,510 జరిమానా విధించారు. కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సర్కిల్-2 కార్యాలయంలో నిర్వహించిన మొబైల్ కోర్టులో శానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై 27 కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ముందు హాజరుపరిచినారు. వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. ఈకార్యక్రమంలో జోనల్ కమిషనర్-2, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగరపాలక సంస్థ మౌలానా ఆజాద్ ఉర్దూ హైస్కూల్‌లో 53 వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ పాఠశాల విద్యార్థుల సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో పాఠశాల హెచ్‌ఎం ఎం.నాగలింగేశ్వర రావు, గణిత, సైన్సు టీచర్లు యశోద, ఫరీసా అక్తర్, ముంతాజ్ సుల్తానా, స్కూల్ సూపర్వైజర్ యం.డి.హుస్సేన్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ఆటోకార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నగర కార్యదర్శి గూడెల జనార్ధన్ అద్యక్షతన విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో ఆటోవర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) విజయవాడ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జిఒ21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు

బడ్జెట్లో విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచాలని కోరారు. ఈ మహాసభలో అశోక్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జాతీయ విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యారంగాన్ని కార్పొరేటీకరిస్తోందన్నారు. దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారని పేర్కొన్నారు. కేంద్రం ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం అవే విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల ప్రైవేటీకరణ, 3,4,5 తరగతుల విలీనం లాంటి విధానాలను వేగంగా అమలు చేస్తోందన్నారు.

జిల్లా నూనత కమిటీ

మహాసభలో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్ వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జి.గోపి నాయక్, ఎం.కుమార్ నాయక్, సి.హెచ్.ప్రణీత, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఎస్.కె జాహిద, మన్మధ, రాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా షైని, కుమార్ స్వామి, రిజ్వాన్, అజయ్ కుమార్, పి.రవి, ఎం.సునీల్, ఎం.అభిలాస్, బాషా ఎన్నికయ్యారు.

అప్పులు...పస్తులు...

చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఎనిమిది నెలలుగా కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడు వేల చొప్పున తీసుకునేందుకు అంగీకరించాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ గ్రాంటు వస్తేనే రూ.9 వేలు ఇస్తామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు గ్రామ పంచాయతీల్లోనే క్లాప్, షెడ్ మిత్రాలు ఈ దుస్థితి ఎదుర్కొంటున్నారనుకుంటే పొరపాటే.....జిల్లాలో మొత్తం 491 గ్రామ పంచాయతీల్లో 472 చోట్ల చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్లాప్ మిత్రాలు 1273 మంది, 374 మంది షెడ్ మిత్రాలు పనిచేస్తున్నారు. వీరందరికి నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిత్యావసరాల ధరలు కొండెక్కడంతో ఇటీవల కాలంలో సామాన్యుల బతుకులు భారంగా మారాయి. రెక్కాడితేగానీ డొక్కాడని కష్టజీవులకు పూటగడవడమే కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో అరకొరగా ఇచ్చే వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంపై క్లాప్, షెడ్ మిత్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 6 కోట్లు పెండింగ్

జిల్లాలో మొత్తం రూ.6 కోట్ల వరకు క్లాప్, షెడ్ మిత్రాలకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా క్లాప్ మిత్రాల వేతనాలకు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. పంచాయతీలు రూ.1.85 కోట్లు బిల్లులు పెట్టాయి. నెలలు గడుస్తున్నా ట్రెజరీల నుంచి నిధులు విడుదల కావడం లేదు.

90 శాతం పంచాయతీల్లో నెరవేరని లక్ష్యం

క్లాప్ మిత్రాలు ఉదయం వేళల్లో పొడి తడి చెత్తలను విడివిడిగా సేకరించాలి. సాయంత్రం చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే ప్రక్రియను చేయాలి. 90 శాతం గ్రామ పంచాయతీల్లో ఈ లక్ష్యం నెరవేరడం లేదు. క్లాప్ మిత్రాలు ఉదయం చెత్త సేకరిస్తున్నా...సాయంత్రం వేళల్లో వారితో డ్రయిన్లలో సిల్ట్ తొలగించడం వంటి పనులు చేయిస్తున్నారు. దీంతో సేంద్రీయ ఎరువుల ప్రక్రియ జరగడం లేదు.

'ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి'ను విజయవంతం చేయాలి : దేవినేని ఉమా

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ఓట్లు వేసిన ప్రజలు తమకు ఇదేం కర్మ అని భావిస్తున్నారని, ఈ ఉద్దేశ్యంతోనే అధినేత చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులంతా కషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గొల్లపూడి పార్టీ కార్యాలయంలో "ఇదేం ఖర్మ ... మన రాష్ట్రానికి' ప్రచార గోడపత్రికను పార్టీ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు జువ్వా రామకష్ణ, జంపాల శీతారామయ్య, నర్రా వాసు, రామినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణశాఖ సమావేశంలో ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఢిల్లీలోని రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన మంగళవారం జరిగిన సమావేశానికి మొదటిసారిగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి అధ్యక్షత వహించారు. సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మనుగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం రక్షణ మంత్రిత్వశాఖ సెక్రెటరీ గిరిధర్ అరమణే, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖ నిబంధనలు, రెగ్యులేషన్లపై చర్చించారు.

ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరి కోతకు ముందస్తు సమాచారం అందించడం, 17 తేమ శాతం, ఎకరానికి 26 క్వింటాళ్ల ధాన్యం సేకరణ, గోనె సంచులు, రవాణాకు వాహనాన్ని సమకూర్చడం వంటి వాటిపై అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. రబీ సాగు లేనందున ఆరుతడి పంటలకు సిద్ధమయ్యే క్రమంలో రైతులు తమ ధాన్యంను విక్రయించడానికి తొందరపడే అవకాశం ఉన్నందున గోనె సంచుల కొరత, రవాణా సమస్యలు రాకుండా చూడాలన్నారు.

CHANGE OF NAME

I, CHANDRASEKHAR SIDDABATTINI (Old Name), Resident of 6-149/1, Vasantha Towers, BMPS Road, Prasadampadu, Vijayawada-521108, Krishna, AP. My Name has been changed to **SIDDABATHINI CHANDRA SEKHAR (New Name)** Hereafter my name is known as **SIDDABATHINI CHANDRA SEKHAR.**

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT GUDIWADA
OS No.57/2019

Between:-
Boppana Venkata Satya Naga Bhushanam ....Plaintiff
And
Potluri Seetha and Two Others ...Defendants

To
Potluri Sudha Rani
D/o Veera Venkata Jagan Mohana Rao, Employee Gowtham Concept School, By Pass Road, Gudiwada-521301, Krishna District, Gudiwada JCJC ..3rd Defendants.

పై నంబరు గల దావా అనగా 3వ ప్రతివాది హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.19-12-2022(సోమవారం)వ తేదిన వాయిదా వేసినారు. కావున ది.19-12-2022 తేదిన ఉదయం 10-30 గం॥లకు శ్రీ కోర్టు వారి యెదుట మీరు ప్రత్యక్షంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని మీ తరుపు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా ది:19-12-2022

ఇట్లు
యన్.బెంజిమెన్,
వాది తరుపున న్యాయవాది,
గుడివాడ.

జనం అండతో మళ్లీ గెలుస్తా : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం

వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై పోటీచేసి భారీ మెజార్టీతో గెలిచి గన్నవరం నియోజకవర్గ చరిత్రను మరోసారి తిరగ రాస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ స్పష్టం చేశారు. మంగళవారం గన్నవరం పట్టణంలోని రాయనగర్‌లో ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందించారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే చెప్పండి అని అడిగి తన పుస్తకంలో రాసుకున్నారు. కొద్ది రోజుల్లో ఈ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కళ్యాణ మండపం రోడ్డులో కొంతమంది మహిళలు వంశీ అన్న నువ్వు పార్టీ మారడం మాకు ఇష్టం లేదని అన్నారు. దానికి ఆయన నవ్వుతూ.. గన్నవరం నియోజకవర్గంలో తనను నమ్ముకున్న వారికి, ప్రజలకు నష్టం జరగకూడదని, ఎవరికీ కష్టం లేకుండా చేయాలని తాను పార్టీ మారినట్లు వివరించారు. గన్నవరం పంచాయతీలో రెండు వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే అందుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో వేలాదిమందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా ఇల్లు నిర్మించుకునే పరిస్థితిని కల్పించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందజేయడంతో పాటు రోడ్లు, భవనాలు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రాయనగర్ క్లబ్‌కు మూడు వైపులా ఉన్న మూడు రోడ్లను రూ.40 లక్షలతో తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు మహిళల దష్టికి తెచ్చారు. ఆ తర్వాత వంశీ నడక సాగించారు. ప్రభుత్వ పథకాలు వస్తున్నాయని, వ్యక్తిగత సమస్యలను ఆయన దష్టికి తెచ్చారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు కొనుగోలు చేయడానికి ఆర్థిక చేయూత అందించారు. ఓ వృద్ధుడు వంశీ వద్దకు వచ్చి ఆయన ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని అందుకుని నాకు కష్టం వచ్చినప్పుడల్లా మీరే ఆదుకున్నారంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. మండల వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్ దగ్గరుండి ప్రతి ఇంటికి ఎమ్మెల్యేని తీసుకెళ్లారు. స్థానిక సమస్యలతో పాటు ప్రతి కుటుంబంలో ఉన్న వ్యక్తిగత సమస్యలను వంశీ దష్టికి తెచ్చారు. ఓ యువకుడు సారు వచ్చే ఎన్నికల్లోనూ మీదే విజయం అనడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ ఎ.ఎలిజబెత్ రాణి, కో ఆప్షన్ నెంబర్ గౌసాని, గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య నాగేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నె సుందర రావు, ఎంపీడీవో కె. వెంకటేశ్వరరావు , గన్నవరం సిఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న వల్లభనేని వంశీమోహన్

సులభమైన ఆపరేషన్ వేసెక్టమీ : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మగవారికి సులభమైన శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతి వేసెక్టమీ అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ గీతాభాయి

ఈనెల 21 నుంచి డిసెంబర్ నాలుగో తేదీ వరకూ వేసెక్టమీ ఆపరేషన్‌పై అవగాహన, శస్త్రచికిత్సల పక్షోత్సవంలో భాగంగా మంగళవారం డిఎంహెచ్ ఓ కార్యాలయం నుండి కోనేరు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎన్ ఎస్ వి అంటే కోత, కుట్టులేని వేసెక్టమీ ఆపరేషన్ అని పేర్కొన్నారు. ఇది మగవారికి సులభమైన శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతని తెలిపారు. మగవారు వేసెక్టమీ చేయించుకోవటానికి ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ ఐదు నుంచి పది నిమిషాల్లో నిర్వహిస్తారని చెప్పారు. ఆపరేషన్ 30 నిమిషాల అనంతరం ఇంటికి వెళ్ళొచ్చునని పేర్కొన్నారు. సురక్షితమైందన్నారు. ఎలాంటి లైంగిక ప్రక్రియ పటుత్వం తగ్గదన్నారు .ఈ ఆపరేషన్‌తో శారీరకంగా ఎలాంటి బలహీనత కలగదన్నారు. ఆపరేషన్ చేయించుకుంటే రూ1100 నగదు పారితోషికం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కనీసం 48 గంటల వరకు పనిలోకి వెళ్లకూడదన్నారు. బరువు పనులు చేయరాదని సూచించారు. వారం రోజులు తర్వాత సైకిల్ కూడా తొక్కొచ్చునన్నారు. మగవాళ్ళు తమ బాధ్యతను తెలుసుకొని వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవాలని కోరారు. ఈర్యాలీలో డాక్టర్ ఎస్. శర్మిష్ట, డి .ఐ .ఓ ఆనంద్, ఎస్‌ఓ పుష్పరాణి, డిప్యూటీ డెమో బి రాజేంద్ర కుమార్, హెచ్ఈ మచిలీపట్నం నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు, ఆశాలు వర్కర్లు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌కు పెనుమల్లి విద్యార్థులు

ప్రజాశక్తిలి-పెడన

పెడన మండలం పెనుమల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ కు ఎంపికయ్యారు.ఈ విషయాన్ని

విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచ్ గరికపాటి రామానాయుడు

మంగళవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జీవి విజయ కుమారి స్థానిక పాత్రికేయులకు తెలిపారు. పాఠశాలకు చెందిన మురాల గాయత్రి, కాగిత వాణి ప్రసన్నలు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ఈ ఘనత లభించింది. మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పెస్ట్ బస్టర్ కస్టర్డ్ ఆపిల్ అనే ప్రాజెక్టు అంశంలో విద్యార్థులు ఈ ఘనత సాధించారు. జిల్లా స్థాయిలో మొత్తం 37 ప్రాజెక్టులు ప్రదర్శించగా 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. డిసెంబర్లో చిత్తూరు జిల్లా గూడూరులో జరగనున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో వీరు పాల్గొంటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన గాయత్రి, వాణీ ప్రసన్న, వీరికి తర్ఫీదు ఇచ్చిన సైన్సు టీచర్ కపావర్ధన్‌ను సర్పంచ్ గరికిపాటి రామానాయుడు, విద్యా కమిటీ చైర్మన్ జోగి నాగరాజు, ప్రధానోపాధ్యాయిని విజయ కుమారి అభినందించారు.

ఎంటియు 1061ను ఏ గ్రేడ్ ధాన్యంగా గుర్తించాలి

ఏపి కౌలు రైతు సంఘం
కృష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గత 19 సంవత్సరాలుగా ఏ గ్రేడ్ గా ఉన్న 10 61 రకాన్ని కామన్ వెరైటీగా మార్పు చేయటం రైతుల పాలిట శాపంగా మారిందని దీనివలన క్వింటాకు రూ.20 నష్టపోవాల్సివస్తోందని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ

మాట్లాడుతున్న పంచకర్ల రంగారావు

గ్రేడుగా ఉన్న ధాన్యాన్ని కామన్ వెరైటీగా మార్పు చేసి, మిల్లర్లకు దోచి పెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం రైతులు ఆ షాక్ నుండి కోలుకోక ముందే తిరిగి ఈ విధంగా ప్రకటించటం చాలా శోచనీయమన్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగి ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో ధరలు తగ్గించటం సరైన విధానం కాదన్నారు. 1061 రకం ఉన్నంతలో దిగుబడి పెరగటమే కాకుండా వేస్టేజ్ తక్కువగా వచ్చే రకంగా పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం 1061 రకాన్ని ఏ గ్రేడ్ గా ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం, జిల్లా కోశాధికారి టీ వీ లక్ష్మణ స్వామి, సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రెండోవార్డులో కొడాలి నాని పర్యటన

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక 4వ వార్డులో 2వ రోజు మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధికార యంత్రాంగంతో

మాట్లాడుతున్న కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)

కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జె సంపత్‌కుమార్, వైసీపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, పాలేటి చంటి, వార్డు పెద్దలు రావుకొల్లు సుబ్రహ్మణ్యం, నాగమల్లేశ్వరరావు, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-పెడన

పెడన మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరుగుతుందని కమిషనర్ ముల్లారపు అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ చైర్పర్సన్ బి జి ఎల్ జోష్నారాణి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

నార్త్ సౌత్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

బీటెక్ ,బి ఫార్మసీ, మెడిసిన్ చదివే ఓ సి, బి సి కులానికి చెందిన వారికి నార్త్ సౌత్ ఫౌండేషన్ ద్వారా రూ.25 వేలు

మాట్లాడుతున్న సింగంశెట్టి ఆదినారాయణ

ఆర్థిక సహాయం అందించనున్నట్లు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. స్థానిక శేషాద్రిరావు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సెట్లో 10000 లోపు ర్యాంకు సాధించిన వారికి, ఎంసెట్లో 15 వేల లోపు ర్యాంక్ సాధించి ఓసి, బిసి వారు అర్హులని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు లోపు ఉన్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి వి ఎస్ ఎన్ ఆర్ వి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి కోడంద రామారావు, వై పి సి ప్రసాద్, ఏ ఫణి గోపాల్ తదితరులు పాల్గొన్నారు .

వైసిపికి వ్యతిరేకంగా ప్రచారం : జడ్‌పిటిసి

ప్రజాశక్తి-పెడన

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ తీరునకు వ్యతిరేకంగా ఇదేం ఖర్మలో భాగంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యులు అర్జా వెంకట నగేష్ పిలుపునిచ్చారు. టిడిపి

మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్

పెడన నియోజకవర్గ ఇన్చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇదేం ఖర్మ కార్యక్రమంపై మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్, సీనియర్ నాయకులు పామర్తి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యాచకులకు అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

మంగళవారం హనుమాన్ జంక్షన్‌లో హిందూ ధర్మ పీఠం అన్నదాన సంఘం, సేవాసదనం సహకారంతో సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి ఆధ్వర్యంలో మూడో వారం యాచకులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. బాపులపాడు మండల కమిటీ కార్యదర్శి గా ధారావత్ రాజగోపాల్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రహమతుల్లా, కార్యవర్గ సభ్యులు గా కాంపాటి ప్రసాద్ లను ఎన్నుకొని వ్యవస్థాపక అధ్యక్షులు జారీచేసిన నియమిత పత్రాలను మండల కన్వీనర్ కాలి కిరణ్ బాబు అందజేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు కోటా సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పీఠం అన్నదాన సంఘం, సేవా సదనం అధికార ప్రతినిధి పొట్లూరి శ్రీ సత్య ఫణీంద్ర , కృష్ణాజిల్లా అధ్యక్షులు తిరుమల శెట్టి రవి, ప్రచార సమితి మండల కన్వీనర్ కాలి కిరణ్ బాబు, కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సమితి ప్రతినిధులు

ఉద్యోగుల పట్ల చిన్నచూపు తగదు

• సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం • ఎన్జీవో నేతలు ఎ.విద్యాసాగర్, ఎండి ఇక్బాల్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రభుత్వ పథకాలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వద్దకు తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులపై చిన్నచూపు తగదని, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక భాగంగా భావించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. స్థానిక గాంధీనగర్ ఎన్జీవో హోమ్ లో జరిగిన ఏపీఎన్జీవో విజయవాడ నగర శాఖ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపి ఎన్‌జివో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన డీఏ, పిఆర్‌సి బకాయిల చెల్లింపు, జిపిఎఫ్, ఇన్సూరెన్స్ మరియు సరెండర్ లీవ్ వంటి వాటి పెండింగ్ బిల్లుల చెల్లింపు, సిపిఎస్ రద్దు అంశంతో పాటు అనేకమైన డిమాండ్లు సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామని చెప్పినా ఇంతవరకు ఫలితం కనబడటం లేదని తెలిపారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల పట్ల మంత్రులు చులకనగా మాట్లాడటం తగదన్నారు. అవసరమైతే కాళ్లు పట్టుకోవడం వంటి మాటలు ఆక్షేపణీయమన్నారు. ఇటువంటి సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ వ్యాఖ్యలు ఉద్యోగుల్లో తీవ్ర మనస్తాపానికి గురి చేశాయన్నారు. ఉద్యోగులు కోరుకేది న్యాయమైన డిమాండ్‌లు మాత్రమేనని రావాల్సిన బకాయిలను మాత్రమే కోరుతున్నామన్నారు. ఏపి ఎన్‌జివో అసోసియేషన్ విజయవాడ నగర శాఖకు ఘన చరిత్ర ఉందని రాష్ట్రంలో జరుగుతున్న అనేక ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యమాలకు విజయవాడ వేదికగా నిలిచిందన్నారు. ఉద్యమాలను విజయవంతం చేయడంలో ఎన్జీవో నగర శాఖ జిల్లా నాయకత్వంతో పాటు ముఖ్య భూమికను పోషిస్తుందన్నారు. ఎల్లప్పుడు ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ ఉద్యోగుల సమస్యల పట్ల నిరంతర కార్యాచరణ చేస్తుందని కొనియాడారు. ఉద్యోగ సమస్యలతో పాటు సామాజిక కార్యక్రమాలలో నగర శాఖ కార్యవర్గం చురుకైన పాత్ర పోషించి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారానే ఉద్యోగుల హక్కులు ప్రయోజనాలు సాధించుకోగలమని ఇప్పటివరకు రాష్ట్ర ఎన్జీవో సంఘ మిచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు ఎటువంటి సహాయ సహకారాలు అందించారు మునుముందు జరగబోయే కార్యాచరణకు కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు జె. స్వామి, కె. సంపత్‌కుమార్లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కార్యవర్గం చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేధికను సమర్పించి జమా ఖర్చుల వివరాలను వివరించారు. సర్వసభ సమావేశంలో నగర శాఖ సహా అధ్యక్షులు బివి రమణ, కోశాధికారి ఎస్‌కె నజీర్‌ద్దీన్, అర్గనైజింగ్ సెక్రటర్ వివి ప్రసాద్, ఉపా అధ్యక్షులు బి రాజా చౌదరి, వై రవి, ఎస్‌కె కాసిమ్ సాహేబ్, కె. శివలీల, సంముక్త కార్యదర్శులు ఎన్ దుర్గరావు, కెఆర్‌ఎస్ గణేష్, సిహెచ్ సివిఆర్ ప్రసాద్, జి వెంకటేశ్వరరావు,డిఇసి మెంబర్లు కె. శివశంకర్, భాస్కర్ నాయుడు, ఎ నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విద్యాసాగర్

నండూరి స్ఫూర్తితో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి-విజయవాడ: కార్మికోద్యమ నాయకులు నండూరి ప్రసాదరావు స్ఫూర్తితో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేయాలని సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు కె దుర్గారావు పిలుపునిచ్చారు. నండూరి ప్రసాదరావు 21వ వర్ధంతి బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు భవన్‌లో మంగళవారం జరిగింది. ముందుగా నండూరు ప్రసాదరావు చిత్రపటానికి సిఐటియు సీనియర్ నాయకులు టి.ప్రభుదాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానుద్దేశించి దుర్గారావు మాట్లాడుతూ కార్మికోద్యమ నాయకులు నండూరి ప్రసాదరావు తన జీవితం మొత్తాన్ని కార్మికులు, శ్రమ జీవుల ప్రయోజనాల కోసం పోరాటాలు నిర్వహించిన మహా నాయకులు అని కొనియాడారు. అందరికీ ఆదర్శంగా ఉంటూ చాలా ఆప్యాయతగా కార్యకర్తలను పలకరిస్తూ ఉత్సాహ పరిచే వారిని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడి కార్మికుల హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ ఆఫీస్ బేరర్స్ వై సుబ్బారావు, ఎం బాబురావు, బి గోవింద్, సిహెచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మైలవరం విద్యార్థులు

ప్రజాశక్తి-జి.కొండూరు: అండర్-19 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాంప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 28వ తేదీన కృష్ణాజిల్లా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలబాలికల రెజ్లింగ్ ఎంపికలు మైలవరం ఎస్.ఎస్.కెలో జరిగాయన్నారు. హనిమిరెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రీకోరోమన్ విభాగంలో ఎం.చరణ్‌తేజ్, బి.వెంగళయ్య, షేక్ నాగుల్ మీరావలి, ఫ్రీస్టైల్ విభాగంలో డి.అభినవ్‌లు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకయ్య, జి.మెర్సి రోజిన అభినందించారు.

నేడు సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-మైలవరం: ఈ నెల 30వ తేదీన సిఐటియు మైలవరం 4వ మహాసభ స్థానిక సియంఆర్ కన్వెన్షన్ హాలులో జరుగుతుందని మండల కార్యదర్శి చాట్ల సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటి గంట నుండి నాలుగు గంటల వరకూ మహాసభ జరుగుతుందని, అనంతరం బోసు బొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మైలవరం: ఎపి స్టేట్ కౌన్సిల్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన ఎక్సలెన్స్ అవార్డు పోటీలలో స్థానిక ఎల్ బి ఆర్ సి.ఇ విద్యార్థి ప్రతిభ కనబర్చినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులలో చివరి రౌండ్‌కు 16 మంది ఇన్‌ఫ్లుఎన్సియల్ అవార్డుకు ఎంపికవ్వగా ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల విద్యార్థిని అన్నపురెడ్డి హర్షిత అవార్డుకు ఎంపికై ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు, ఈ నెల 30వ తేదీన మదనపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా రూ.60 వేల నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను అందుకుంటారన్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షితను అభినందించారు.

రాష్ట్ర సభ్యునిగా సరికొండ

ప్రజాశక్తి-విస్సన్నపేట: బట్రాజు సాధికార కమిటీ టిడిపి విభాగం రాష్ట్ర సభ్యుడుగా తిరువూరు నాగార్జున జూనియర్ కళాశాల అధ్యాపకులు, వామకుంట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయ కులు సరికొండ మట్టం రాజు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడి నుండి నియామక ఉత్తర్వులు వచ్చినట్లు రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల కరస్పాం డెంట్ వి.నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శేషగిరిరావు, డైరెక్టర్లు డి.హనుమంతరావు, టి.సూరిబాబు, నాగార్జున ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ కె.నరసింహారావు, మట్టంరాజుకు అధ్యాపకులు మట్టం రాజుకు అభినందనలు తెలిపారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-కంచికచర్ల: పేరకలపాడు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది మంగళవారం మురుగు కాల్వల్లో మురుగు తొలగించారు. గ్రామంలో వీధుల వెంట సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు వీదుల వెంట మురుగు కాలువల్లో దోమల నివారణ ముందు పిచికారి చేశారు. సర్పంచ్ మన్నే సాత్విక పారిశు ధ్య పనులు పర్యవేక్షించారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

రౌండ్‌టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పేద ప్రజలు, విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు రావాలని రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ సౌరబ్ పిలుపునిచ్చారు. రౌండ్‌టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం అమతహస్తం సహకారంతో పేదలకు అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్ ఇండియా దేశవ్యాప్తంగా 136 నగరాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 390 కోట్ల రూపాయల వ్యయంతో వేలాది తరగతి గదులను నిర్మించినట్లు ఆయన తెలియజేశారు. తమ సంస్థ పేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ఎంతగానో ప్రోత్సహిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, పలు పాఠశాలలు కూడా నిర్మించి కనీస సదుపాయాలు అయిన టాయిలెట్స్, లైబ్రరీలు నిర్మించడం జరిగిందన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా కిచెన్ లో భాగంగా దేశవ్యాప్తంగా పది రోజుల పాటు ప్రతిరోజు 150 మందికి అన్నదానం చేయాలని లక్ష్యంగా విజయవాడ నగరంలో అమత హస్తం సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. తదనంతరం రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ చైర్మన్ జి. హర్ష మాట్లాడుతూ తమ సంస్థ తరపున విజయవాడ నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా 60 వేల రూపాయలు అమత హస్తం ట్రస్టు కు ఇవ్వడం జరిగిందని పది రోజుల పాటు ఈ ట్రస్ట్ పేద ప్రజలకు అన్నదానం చేస్తుందని వివరించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా నేషనల్ కోఆర్డినేటర్ కౌశిక్ లేడీస్ సర్కిల్ చైర్పర్సన్స్ విమల, డాక్టర్ ప్రశాంతి, సంస్థ ప్రతినిధులు కాట్రగడ్డ మోహన్, తరణ్ దీప్ సింగ్ చలసాని బాబ్జి, అమత హస్తం ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.